# అశాంతినగరం

**— పాలకూర సీతాలత**

జలజ చాలా ధైర్యవంతురాలు. ఆమె చిన్నప్పటి నుంచీ చాలా కష్టాలు అనుభవించింది. అయినా ఆమె ఏనాడూ కంటతడి పెట్టలేదు. ఎంతటి ఘోర విపత్కర పరిస్థితులనైనా చిరునవ్వుతో స్వీకరించగల మనోస్థైర్యం ఆమె సొత్తు.

చిన్నప్పుడే ఆమె తండ్రి పోయాడు. ఆమె తల్లి అన్నగారి పంచన చేరింది. లోకానికి భయపడి జలజ మేనమామ ఆ బాధ్యత స్వీకరించాడు తప్ప అతనికి ఎంత మాత్రం ఇష్టంలేదు. అందుకే జలజకు కొంత అన్యాయం జరిగింది. తనకు అన్యాయం జరుగుతోందని తెలిసినా ఎంత మాత్రం బాధపడలేదు ఆమె. జలజ తల్లి కన్నీళ్లు పెట్టుకుంటే తల్లిని ఓదార్చేది జలజ.

జలజ స్నేహితురాలు కుమారి. జలజ ఇటువంటి పరిస్థితులు ఆమెకు తెలుసు. అందుకే జలజను ఆమె ఆరాధించసాగింది. ఏడవడం సంగతి దేవుడెరుగు.. బాధలో జలజ కంఠం పూడుకుపోవడం కూడా కుమారి ఎప్పుడూ చూడలేదు.

"యు ఆర్ ఏ డేరింగ్ గర్ల్ ... ఎంతటి విపత్కర పరిస్థితీ కూడా నిన్ను కదిలించలేదు .." అనేది కుమారి.

జలజ చిన్నగా నవ్వి ఊరుకునేది తప్ప జవాబు చెప్పేది కాదు.

జలజ చదువు పూర్తయ్యింది. [illegible] ఆమెకు హైదరాబాదు ఆకాశవాణిలో ఎనౌన్సరు ఉద్యోగం వచ్చింది. తల్లిని వెంట పెట్టుకుని, మేనమామకు 'గుడ్‌బై' చెప్పి హైదరాబాద్ వచ్చేసింది జలజ.

మరికొన్ని రోజుల తర్వాత కుమారికి కూడా అక్కడే ఉద్యోగం రావడంతో ఆమె ఎంతో సంతోషపడిపోయింది. ఇద్దరి మధ్య స్నేహం మరింత వృద్ధి చెందసాగింది.

[illegible] కుమారి కొలీగ్స్‌తో జలజ గురించి చెప్పేది.

"[illegible] అది ... ఎంత కష్టమైనా, ఎంత విషాదం కలిగించే వార్తయినా అయినా జలజను కదల్చలేవు .." అనేది.

ఆకాశవాణిలో అందరూ కూడా జలజ గొప్పతనాన్ని అభినందించేరు.

* * *

"ప్రాంతీయ వార్తలు అయిపోగానే కర్ఫ్యూ కారణంగా బట్వాడా కాని కొన్ని టెలిగ్రాములు నువ్వు చదవాలి".. అంది కుమారి.

"ఓ యస్.. దాందేముంది?" అంది జలజ తేలిగ్గా.

సమయం సాయంత్రం ఆరు గంటల ఇరవై అయిదు నిముషాలు.

జలజ మైకుముందు నిలబడింది ఆమె గొంతు విప్పింది.

జంటనగరాలలో కర్ఫ్యూ కారణంగా బట్వాడా కాని కొన్ని టెలిగ్రాముల వివరాలు వింటారు. మద్రాసు నుంచి వై. వెంకటేశ్వరరావు, ఇంటినంబరు ...., ఖైరతాబాదుకి వచ్చిన టెలిగ్రాం



మదర్ ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ .. పంపినవారు వై.మధు .... కాకినాడ నుంచి పి. సుబ్బారావు. ఇంటి నంబరు ...., లింగంపల్లికి వచ్చిన టెలిగ్రాం ... ఫాదర్ సీరియస్ .. కమ్ క్విక్లీ ... పంపినవారు రాజగోపాలం, గుంటూరు నుంచి ఆర్. సుదర్శనం, ఇంటినంబర్ ...., మాదన్నపేట కాలనీకి వచ్చిన టెలిగ్రాం — ఫాదర్ మెట్ విత్ ఏక్సిడెంట్, కండిషన్ సీరియస్, కమ్ ఇమ్మీడియట్లీ .. పంపినవారు — గోపాలరావు; విశాఖపట్నం నుంచి టి. సత్యానందం, ఇంటినంబరు ...., రామ్‌కోటికి వచ్చిన టెలిగ్రాం — మదర్ ఎక్స్‌పైర్డ్ .. కమ్ క్విక్లీ .. పంపినవారు ... లక్ష్మీనరసింహమూర్తి ...

జలజ గమనించిందో లేదో తెలియదు గానీ... ఆ వివరాలు వింటున్న శ్రోతలు గమనించారు. ఎనౌన్సరు గొంతులో సన్నగా వణుకు ...

మరికొన్ని టెలిగ్రాములు చదివిన తర్వాత ..

ఎనౌన్సర్ గొంతులో బాధ ...

మరికొన్ని వివరాలు చదవగానే ఎనౌన్సర్ గొంతులో జీర ...

ఆ సమయంలో జలజను ఎవరైనా చూస్తే ఆమె కళ్లలో తడి గుర్తించగలరు...

అక్షరాలు అలుక్కుపోయి చదవడం కుదరలేదు జలజకు ... వివరాలు చెప్తూనే కళ్లు తుడుచుకుంది ... మళ్లీ చదివింది.

మొత్తానికి చదవడం పూర్తి చేసి బయటకు వచ్చేసింది.

కుమారి అప్పుడే చూసింది జలజను. జలజ ముఖం కళ తప్పివుంది.. ఆ సమయంలో ఆమెను చూస్తే ఆమెకు సంబంధించిన వారు ఎవరైనా చనిపోయారేమో ... అందుకే అలా వుందేమో అనుకోక తప్పదు.

జలజ మరోకసారి కళ్ళు తుడుచుకుంది.

జలజా .. నువ్వు .. కన్నీళ్లు పెట్టుకుంటున్నావా?" అంది కుమారి ఆశ్చర్యంగా.

నిజమే మరి.. అది ప్రపంచంలో ఎనిమిదవ వింత.

"అవును. ఏం? నాకు ఆ హక్కులేదా? నేను మనిషిని కానా?" అంది జలజ.

కుమారి ముఖం చిన్నబోయింది.

"ఆహా. అదికాదు .. రా కూర్చో ... ముందు కాసిని మంచినీళ్లు తాగు ..." అంది కుమారి.

జలజ మంచినీళ్లు తాగింది. అయిదు నిముషాలు గడిచినా ఆమె కోలుకోలేదు.

"ఏమైంది జలజా? ఎందుకిలా వున్నావు?" అంది కుమారి.

"ఏం కాలేదని అడుగు కుమారీ .. మనం మనుషులమేనా అనిపిస్తోంది. నగరంలో జరుగుతున్న మారణ హోమాలు తలుచుకుంటే ఎంత ఘోరమైన పరిస్థితిల్లో వున్నామో ఆలోచించు. పొరుగూర్లో ఆత్మీయులు చనిపోయినా గుమ్మందిగి వెళ్లలేని పరిస్థితి. ఇంత కంటె హీనం మరొకటి వుందా? ఊరికి వెళ్లడానికి వీల్లేకుండా కర్ఫ్యూ... ఎలాగో రైలుకి వెళ్దామంటే ఆ రైళ్ల కాన్సిల్ ... మనుషుల్లో ఇంత సంకుచిత తత్వం ఎలా కలిగింది.. మామతం, మీమతం అంటూ ఈ అడ్డుగోడలు ఎందుకు . మధ్యలో అమాయక ప్రజలు బలి అయిపోతున్నారే. లక్షల ఆస్తికి నష్టం కలుగుతోందే! దీన్ని పరిదిద్దడం ఎవరి తరమూ కాదా? ఈ వ్యాధికి మందు లేదా? ఆ టెలిగ్రాములు చదువుతుంటే .. ఎవరో నావాళ్లే పోయినట్లు .. కడసారి చూపులు కూడా దక్కనీయకుండా కాళ్లు, చేతులు కట్టి పారేసినట్లు ఫీలయ్యాను. చిన్న అగ్నికణంలా రగులుకున్న ఆ బాధ మహాజ్వాలలై నన్నే దహించి వేస్తోంది. నేను జీవితంలో ఎంత కష్టం వచ్చినా కన్నీళ్లు పెట్టుకోలేదు. ఇప్పుడెందుకిలా బాధ పడిపోతున్నానే కదూ నువ్వు ఆశ్చర్యపడింది. నాకు అప్పట్లో వచ్చిన కష్టం నా కొక్కదానికే .. కానీ ఈ కష్టం అందరిదీ ... అందుకే నన్ను కదిలించేసింది. విజ్ఞాన శాస్త్రం మనిషి ఎదుగుతున్నాడని చెప్తోంది కానీ .. నిజానికి మనిషి తరుగుతున్నాడు. ప్రాంతీయ తత్వం, కులాభిమానం, మతాభిమానం, స్వార్థం, బంధుప్రీతి — ఇవన్నీ మనిషిని సంకుచిత స్వభావుడిగా చెయ్యడానికి టానిక్‌లాగ ఉపయోగపడుతున్నాయి. ఈ

హైదరాబాదు నగరాన్ని భాగ్యనగరం అని మనం ముద్దుగా పిలుచుకుంటున్నాం కానీ .. ఇది అభాగ్యనగరం .. అభాగ్యుల నగరం .. దౌర్భాగ్యుల నగరం .. ఈ ఏ మారణ హోమానికి ప్రతిపక్షాల కుట్ర కారణమని ప్రభుత్వము, ప్రభుత్వము చేతకానితనమని ప్రతిపక్షాలు ఒకర్నొకరు నిందించుకోవడం ఒక పరిష్కారం కాబోదు. ఎవరూ ఆలోచించటం లేదా ఈ విషయాలు? మనుషులమై వుండీ మృగాలకంటే హీనంగా ప్రవర్తిస్తూ... ఒకళ్ల నొకళ్ళు కసాయివాళ్ల కంటే హీనంగా పొడుచుకుంటూ .. ఎక్కడికి పోతున్నాం మనం? సి.నా.రె గారు చెప్పినట్లు "ఎక్కడికి పోతున్నాం మనం .. ఎక్కవలసిన లక్ష్యాల ఎవరెస్టు శిఖరాల పైకా .. దిక్కుమాలిన పాపాల పాతాళ కుహరాలలోకా .. ఎక్కడకు పోతున్నాం మనం .. ఏ చిక్కుల్లో పడబోతున్నాం?"

ఆ వేశంగా అంది జలజ.

జలజ కళ్ళలో కన్నీటి ముత్యాలు.

జలజ మాటల్లోని నిజాలను తలుచుకుంటూ ఒక్క నిముషం ఆలోచించింది కుమారి. జలజ భుజం మీద చెయ్యి వేసింది.


"కర్ణుడి చావుకి కారణం ఏమిటో చెప్పలేనట్లు, ఈ వ్యవహారంలో కూడా చాలా గజిబిజిలున్నాయి. మనకు అర్థం కావు. పరిష్కరించడం మన చేతిలోనూ లేదు. జాలి పడటం తప్ప ఏం చెయ్యలేం .. ఊరుకో ..." అంది కుమారి.

కుమారి మాటలు చెవికి ఎక్కలేదు జలజకు.


దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయింది.

*


అలపర్తి రత్నకుమారి
(నందివెలుగు)




యస్.పి. కుమారి
(ఆసీఫ్‌నగర్)



పి. విజయభారతి
(శ్రీకాకుళం)






బిందు (జనగాం)